స్వర్ణోత్సవ సంబరానికి సర్వం సిద్ధం

మహిళా సాధికారతే ధ్యేయంగా జిల్లాలో ఏర్పాటైన తొలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకకు సిద్ధమైంది. 1973లో స్వాతంత్య్ర సమర యోధులు కోటిరెడ్డి రామసుబ్బమ్మ, కోటిరెడ్డి చొరవతో ఏర్పాటైన విద్యాలయం జిల్లాలోని మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. శనివారం స్వర్ణోత్సవాల వేడుకకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలకు 50 ఏళ్లు పూర్తి
- నేడు పూర్వ విద్యార్థుల సమావేశం



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 1973 అక్టోబర్, 19న అప్పటి కోర్టు భవనాల్లోని 3.5 ఎకరాల స్థలంలో ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఎందరో మహిళల జీవితాల్లో విద్యాజ్యోతులు వెలిగించింది. తొలుత బీఏ, బీకాంతో ఆరంభమైన కళాశాల ప్రస్తుతం డిగ్రీ, పీజీ కోర్సులను అందిస్తూ స్వయంత్రప్రతిపత్తి కలిగిన కళాశాలగా గుర్తింపు పొందింది. దశాబ్దం కిందట కోటిరెడ్డి, రామసుబ్బమ్మల తనయుడు ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జయభారత్‌రెడ్డి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కోటి రూపాయలు వెచ్చించి అధునాతన సౌకర్యాలతో హాస్టల్ నిర్మించారు. నగర నడిబొడ్డున కళాశాల, చక్కటి రవాణా సౌకర్యం, రక్షణ కలిగిన మహిళల వసతిగృహం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వసతులు ఉండటంతో కళాశాలలో సీటు పొందడం ఆషామాషీ కాదన్నది విద్యార్థినుల మాట.

వైఎస్సార్ చొరవతో సరికొత్త సొబగులు..

2004లో జిల్లాకు చెందిన డా.వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కళాశాల దశ మారింది. రూ.2.5 కోట్ల నిధులు విడుదల చేయడంతో పాటు స్వయాన ముఖ్యమంత్రి హోదాలో 2005లో పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 2008 నాటికి నూతన భవనాలు పూర్తయి కళాశాల సరికొత్త రూపు సంతరించుకుంది. అనంతరం 2014లో కళాశాల తొలి సారి న్యాక్ బీ గ్రేడ్ సాధించింది. రెండోసారి న్యాక్ బీ గ్రేడ్ సాధించి స్వయంప్రతిపత్తి హోదా కొనసాగిస్తోంది. 2024లో ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా సంస్థ జారీ చేసిన ర్యాంకింగ్‌లో రాయలసీమలోనే ప్రథమ స్థానంలో నిలవడంతోపాటు రాష్ట్ర స్థాయిలో 7వ స్థానంలో నిలిచి సత్తాచాటుతోంది.

నేడు స్వర్ణోత్సవ సంబరం

కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ సంబరాలు శనివారం అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా దాదాపు రూ.13 లక్షలు వెచ్చించి కళాశాల వ్యవస్థాపకులు కోటిరెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మల కాంస్య విగ్రహాలను ఈ నెల 11న కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. శనివారం పూర్వ విద్యార్థులందరూ సమావేశమై స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. కళాశాల సిబ్బంది ఇందుకోసం ఏర్పాట్లు చేశారు.

స్వర్ణోత్సవ వేడుకకు ఏర్పాట్లు



కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక నిర్వహిస్తున్నాం. కళాశాల ఏర్పాటైనప్పటి నుంచి ప్రస్తుతం చదువుతున్న వారి వరకు అందరూ ఈ సమావేశంలో పాల్గొనవచ్చు. వారి సూచనలు, సలహాలను తీసుకుని కళాశాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం. కళాశాల అభివృద్ధికి కోటిరెడ్డి వారసుల సహకారం ఎంతో గొప్పది.

– వేమల సలీంబాషా, ప్రిన్సిపల్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల, కడప

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం


వీరాంజనేయస్వామి

కడప కల్చరల్: కడప మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమద్ వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చక బృందం ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకం జరిపి, అనంతరం గణపతి పూజ, కలశ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలమూర్తిని పట్టు వస్త్రాలతో అలంకరించి వెండి కవచాన్ని తొడిగారు. పూలు, తులసీ మాలలతో అలంకరించారు. హాజరైన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్‌గా ఆచార్య సునీత


నియామకపత్రం అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: వైవీయూ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్‌గా, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్(ఆర్‌టిఐ)గా భూగర్భ శాస్త్ర విభాగం ప్రొఫెసర్ వంగల సునీత నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ శుక్రవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ స్థానంలో పనిచేస్తున్న కో ఆర్డినేటర్ ఆచార్య గంగిరెడ్డి, శివారెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో రిలీవ్ అయ్యారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

చింతకొమ్మదిన్నె: గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. డీఎల్‌పీఓ విజయభాస్కరరావు, ప్రత్యేక అధికారి రాఘవ పాల్గొని శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

నిరాశ్రయులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న గొడుగు శంకరయ్య కుటుంబ సభ్యులు


కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని జెడ్పీ వద్దగల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో దాదాతలు శుక్రవారం అన్నదానం నిర్వహించారు. కడపకు చెందిన గొడుగు శంకరయ్య సంస్మరణగా ఆయన కుటుంబ సభ్యులు వసతి గృహంలోని 40 మందికి అన్నదానం చేశారు. దాతల దాతృత్వంతోనే పేదల ఆకలి తీరుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన


పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి జగన్నాథ్

కమలాపురం : సాగునీటి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ పరిశీలించారు. ఈనెల 14న స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో సాగునీటి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఎన్నికల అధికారి సిబ్బంది కలసి ఎన్నికల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. సభ్యులందరూ 8.30 హాజరు కావాలన్నారు. సభ్యులందరూ ప్రభుత్వ గుర్తింపు కలిగిన కార్డు తీసుకువచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 9 గంటలకు సాగునీటి సంఘాల సభ్యుల ఎన్నిక జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ల ఎన్నిక జరుగుతుందన్నారు. సహాయ ఎన్నికల అధికారి సరస్వతి, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


మట్కా బీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

కమలాపురం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ హెచ్చరించారు. మండలంలోని మట్కా బీటర్లకు సీఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై ఏ ఒక్కరూ మట్కా రాయడం కానీ, ఆడటం కానీ జరిగితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. మట్కాకు సంబంధించిన వివరాలను 9121100529కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ హరిసేవ్యానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ముత్తరాసుపల్లె, రెడ్డి కాలనీ, ఫక్కీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్, విద్యా మందిర్ స్కూల్, భాగ్య నగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి భార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సీపీ బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డాక్టర్ జానమద్ది స్మారకోపన్యాస సభ

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్మారకోపన్యాస సభ నిర్వహించనున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జి.విజయభాస్కర్ తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో తెలుగుభాష వైభవం అంశంపై చర్చ ఉంటుందని తెలిపారు. ఖిశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ హాజరు కానున్నారని తెలిపారు.

సమస్యలపై గళమెత్తితే.. జైళ్లు నోళ్లు తెరుస్తున్నాయి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్: పేదల హక్కుల గురించి గళమెత్తితే.. జైళ్లు నోళ్లు తెరుస్తున్నాయని, నిరుపేదలు, దళిత, గిరిజనులకు చట్టాలు అందని ద్రాక్షగా మారాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, విశ్రాంత పరిశ్రమల అధికారి గోపాల్, ఇంజినీర్ గుర్రప్ప, నాగసుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక హరిత హోటల్‌లో నిర్వహిస్తున్న చట్టం అందరికి సమానమేనా సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు. బీజేపీ ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేస్తోందని, ప్రభుత్వ తీరును నిరసిస్తే గొంతు నొక్కేస్తున్నారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాకు పదేళ్లపాటు బెయిల్ ఇవ్వకుండా మానసికంగా వేధించారని ఆరోపించారు. ఖరీదైన లాయర్లను పెట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులో న్యాయం కోసం పేదలు అర్థించలేరక తమ హక్కుల్ని పొందలేక పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక శివరాం కుమారస్వామి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ మేనేజర్‌గా గుర్రప్ప


గుర్రప్ప

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి మేనేజర్‌గా పబ్లిక్ హెల్త్ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటనారి గుర్రప్పను నియమిస్తూ నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మేనేజర్ షకీల్‌ను సస్పెండ్ చేసిన నేపథ్యంలో గుర్రప్పను ఆ స్థానంలో నియమించారు. గుర్రప్ప మాట్లాడుతూ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన వంతు బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తానని చెప్పారు.

ఆళ్లగడ్డ ఇన్‌చార్జి కమిషనర్‌గా కిశోర్

కడప కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.కిశోర్‌ను ఆళ్లగడ్డ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. బీ2గా ఉన్న సీనియర్ అసిస్టెంట్ ఎం. శోభన్ బాబును నార్త్ జోన్ ఆర్ఐగా నియమించారు.

రేపు జయరాజ్ గార్డెన్‌లో బహిరంగ సభ

కమలాపురం : కడప నగరంలోని జయరాజ్ గార్డెన్‌లో ఈనెల 15వ తేదీన జమియత్ ఉలేమా హింద్ పర్యవేక్షణలో నిర్వహించనున్న బహిరంగ సభకు ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని ముస్లిం వక్తలు ముఫ్తి జావీద్ ఆలం ఖాస్మీ, ఖాజీ సయ్యద్ నాసీర్ హుసేనీ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మస్జిద్–ఏ–అక్సాలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేసి మాట్లాడారు.

దేశంలో నియంతృత్వానికి, మైనార్టీలపై అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడం కోసం దేశ వ్యాప్తంగా మూడు చోట్ల ఇలాంటి బహిరంగ సభలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే ఢిల్లీ, పాట్నాలలో సభలు ముగిసాయన్నారు. చివరిగా కడపలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు హజ్రత్ మౌలానా సయ్యిద్ అర్షద్ మదని హాజరు కానున్నారని, ప్రతి ముస్లిం సోదరుడు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. ఆదివారం 2.30 గంటలకు జామియా మస్జిద్ నుంచి వాహనాలు బయలు దేరుతాయన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సాయం చేస్తామనకపోవడం దారుణం



మాట్లాడుతున్న ఎంవీ.సుబ్బారెడ్డి

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రైతులకు సాగు సాయం చేస్తామని చెప్పకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ.సుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు రూ.20 వేల సాయం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వకపోగా, రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఎప్పుడిస్తారో చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు సాగుతున్నాయని, ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం బస్తా ధాన్యాన్ని రూ.2వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేసినప్పుడే అన్నదాతలను ఆదుకున్నట్లు అవుతుందన్నారు. మండలం, గ్రామాలలోనూ ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. డిసెంబర్ 15తో ముగియనున్న పంటల బీమా నమోదును మరో 15 రోజులు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి భాస్కర్, పల్లపోలు రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి వెలుగునిచ్చే ప్రభువు ఏసుక్రీస్తు


ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మత గురువులు, విశ్వాసులు

కడప కల్చరల్: ప్రపంచానికి వెలుగు నిత్య జీవం ప్రభువు యేసుక్రీస్తు అని బ్రదర్ ఐజాక్ పేర్కొన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. షాలోమ్ మిషన్ ప్రేయర్ హాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రదర్ ఐజాక్ ప్రసంగిస్తూ పాపం నుంచి మానవాళిని రక్షించేందుకు ఏసుక్రీస్తు మానవ రూపంలో అవతరించారని, ఆధ్యాత్మిక జీవనం గడిపేందుకు ప్రయత్నించాలని కోరారు. షాలోమ్ మినిస్ట్రీస్ చేస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక సేవలు అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో పి.స్వామిదాసు, పాస్టర్లు ఎం.అబ్రహాం, బీపీ.ప్రసాద్, సుబిద్దీ, బిషప్ శామ్యూల్‌బాబు, డేనియల్ ఏపీపీఎఫ్ మల్లెం విజయభాస్కర్, విజయ శేఖర్, మాసాపేట ఎలీం ప్రార్థనా మందిరం పాస్టర్ దాసరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న బండి జకరయ్య

కడప వైఎస్సార్ సర్కిల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య అన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో వేగం లేదని చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆరోపించడం ఇందుకు అద్దం పడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ నుంచి నవంబరు వరకు 1.69 లక్షల ఫిర్యాదులు వస్తే వాటిలో 30 శాతం ఇంకా పరిష్కరించలేదన్నారు. మండల స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రఫీఖ్ ఖాన్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర ఉర్దూ క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మత గురువులు

కడప కల్చరల్: కడప నగరంలోని అస్తానె–హుసేనియాలో లజన్నతుల్ ఉల్మా వెల్ఫేర్ సొసైటీలో నూతన సంవత్సర ఉర్దూ క్యాలెండర్‌ను మత గురువులు శుక్రవారం ఆవిష్కరించారు. సంస్థ కార్యదర్శి మౌలానా మౌల్వి షేక్ ముహమ్మద్ అలీ రషాది మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉచిత రేషన్ కిట్ల పంపిణీ, వేసవిలో ఒడుగులు(ఖత్నా), ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజరత్ మౌలానా మౌల్వి సయ్యద్ షహజాద్ హుస్సేన్, డాక్టర్ ఎస్ఎండీ.తాహీర్, హజరత్ మౌలానా మౌల్వి ముఫ్తీ సయ్యద్ గౌస్ అహ్మద్ సాహెబ్, నిజామీ, సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, హజరత్ మౌలానా అస్గర్ అలీ పాల్గొన్నారు.

విద్యా దీవెన నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న అఖిరానందన్

కడప వైఎస్సార్ సర్కిల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, విద్యా దీవెన వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అఖిరానందన్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రూ.3840 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పరీక్షలు దగ్గరపడడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తే హాల్ టికెట్ ఇస్తామని చెబుతున్నాయని తెలిపారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షుడు అశోక్, శమంత్ నాయకులు విజయ్ శంకర్ పాల్గొన్నారు.

అమ్మకు దొరకని అభయం కథనానికి స్పందన


కడప రాధాక్రిష్ణనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

కడప రూరల్: కడప పాత రిమ్స్‌లోని రాధాక్రిష్ణ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూలై నుంచి గర్భిణులకు స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. స్కానింగ్ యంత్రం నిరుపయోగంగా మారడంపై సాక్షిలో శుక్రవారం ×అమ్మకు దొరకని అభయం× కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ పట్టణ ఆరోగ్య కేంద్రం సందర్శించి స్కానింగ్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ప్రతి బుధవారం, శుక్రవారం గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో వైద్య సేవలతో పాటు, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సూచనలు చేశారు.




గోతులు పూడ్చేశారు

కడప నగరంలో రహదారులపై గోతులు అధ్వానంగా ఉన్నాయని గత నెలలో సాక్షి కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట గోతులను పూడ్చివేయించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

క్రిస్మస్ సందడి షురూ..





క్రిస్మస్ సందడి మొదలైపోయింది. తారల మెరుపులు, శాంటాక్లాజ్ హడావుడి పది రోజుల కంటే ముందే వచ్చినట్లుగా అనిపిస్తోంది. క్రైస్తవ సోదరుల ఇంట పండగ వాతావరణం కనిపిస్తోంది. నగరంలో ఎక్కడ చూసినా లైటింగ్ స్టార్స్, క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్ తాత, ఆయన దుస్తులు, రంగు రంగుల డెకరేషన్లతో వస్తువులు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. వైవీ స్ట్రీట్‌లో ముందదస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

పాత్రికేయులపై టీడీపీ నాయకుల దాడి హేయం

జిల్లాలో రైతుల కోసం జరుగుతున్న సాగునీటి సంఘం ఎన్నికల కవరేజీకి వెళ్లిన పాత్రికేయులపై దాడి చేయడం హేయమైన చర్య అని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. సాక్షి టీవీ రిపోర్టర్, కెమరామెన్‌లపై రాళ్లతో దాడి చేయడంపై ముక్త కంఠంతో ఖండించారు.

– కడప వైఎస్సార్ సర్కిల్

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



సాగునీటి ఎన్నికల కవరేజ్ కోసం వెళ్లిన సాక్షి టీవీ రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, వేముల మండల రిపోర్టర్ రాజారెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేయడం హేయనీయమైన చర్య. మీడియా ప్రతినిధులు వారి వృత్తి వారు చేసుకుంటుంటే అకారణంగా రాళ్లతో దాడి చేయడం చూస్తే పత్రిక స్వేచ్ఛను హరించడమే అవుతుంది. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. – చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి, కడప

మీడియాపై దాడి చేయడం దారుణం



వేములలో సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి ఘటన దారుణం. ప్రజాస్వామ్యంలో మీడియాకు ప్రశ్నించే హక్కు ఉంది. రాజ్యాంగంలో వాక్ స్వాతంత్య్రం హక్కును హరించేలా విచక్షణా రహితంగా దాడులకు పాల్పడడం వికృత చర్య. ఈ మధ్య కాలంలో మీడియా ప్రతినిధులపై దాడులు పెరిగాయి. వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానిదే.

– వీరణాల శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కడప


జర్నలిస్టులపై దాడులు దుర్మార్గం



విధి నిర్వహణలో ఉన్న సాక్షి ప్రతినిధులపై దాడులు చేయడం దుర్మార్గం. జర్నలిస్టులు సమాజాన్ని మేల్కొలిపేలా విధులు చేపడుతుంటా. అలాంటి విలేకరులపై దాడులకు పాల్పడడం దారుణం. కవరేజీకి వచ్చిన వారిపై ఇలా దాడి చేస్తే ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలి.

– పి.ఖాదర్‌బాషా, జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, కడప

పత్రికా ప్రతినిధులపై దాడులా..



పాత్రికేయులపై దాడి చేయడం అమానుషం. పౌర సమాజంలో జరిగే అక్రమాలను వెలికితీసి ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తూ.. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న పలువురు పాత్రికేయులపై ఇటీవల దాడులు పెరిగాయి. మొన్న మోహన్ బాబు దాడి చేస్తే! నిన్న వేముల ప్రాంతంలో సాక్షి పాత్రికేయులపై టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

–మదగలం ప్రసాద్, ఆర్‌సీపీ నాయకులు, కడప